

బకాయిదారులు ఆస్తి పన్ను చెల్లించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

2024-2025 ఆర్థిక సంవత్సరం వరకూ బకాయి ఉన్న ఆస్తి పన్ను యజమానులు తమ పన్నులు 50 శాతం రాయితీతో చెల్లించాల్సిందిగా కమిషనరు కేతన్ గార్గ్ సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరము వరకూ బకాయివున్న పన్నులపై ఉన్న వడ్డీ 50 శాతం రాయితీ యిస్తూ ఈ నెల 30 వరకూ అవకాశం ఉన్నందున, ఈ అవకాశాన్ని వినియోగించుకొని గత సంవత్సరం వరకూ ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాల్సిందిగా కమిషనర్ సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం పన్ను ఏకమొత్తముగా చెల్లించినవారికి పన్నులో 5 శాతం రాయితీ కూడా ఉందని తెలిపారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన కౌంటర్లతో పాటు నగరంలోని పలు సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పెట్రోల్ బంకుల్లో నిబంధనలు నిల్

- దయనీయంగా నిర్వహణ
- మరుగుదొడ్లు, తాగునీరు, టైరు గాలి లేని దుస్థితి
- వ్యాపారమే పరమావధిగా యాజమాన్యాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పెట్రోల్ బంకుల యాజమాన్యాలు నిబంధనలకు నీళ్లొదులుతున్నాయి. అత్యధిక బంకులలో టైర్లకు గాలి కొట్టిద్దామంటే అవకాశం ఉండదు.. దాహం వేస్తే తాగునీరు దొరకదు.. మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం లేదు. కొన్ని చోట్ల ఏర్పాటు చేసినా నిర్వహణ అధ్వానంగా మారింది. పెట్రోల్, డీజిల్ కొలతల్లోనూ నీలి నీడలు కమ్ముతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోలు నాణ్యతా ప్రమాణాలు పరీక్షించడానికి ఫిల్టర్ పేపర్లు వినియోగదారులకు ఇవ్వాలి. ఎక్కడా ఇస్తున్న దాఖలాలు లేవు. ప్రజల ప్రయాణ అవసరాల రీత్యా జిల్లాలో వాహనాల సంఖ్య ప్రతి సంవత్సరమూ గణనీయంగా పెరుగుతోంది. ద్విచక్ర వాహనాలతో పాటు, కార్లు, లారీలు, బస్సులు ఇతర వాహనాల సంఖ్య కూడా అధికంగా వినియోగం పెరిగింది. ఈ నేపథ్యంలో పెట్రోలు, డీజిల్ వ్యాపారం విస్తతంగా పెరగటంతో జిల్లావ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లు సుమారు 100కు పైగా ఏర్పాటైనట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. పెట్రోలు, డీజిల్ సరఫరా చేసే కంపెనీలు సైతం డీలర్లకు ఆకర్షణీయమైన కమీషన్ ఇస్తూ బంకుల సంఖ్యను పెంచుతూ వస్తున్నాయి. అయితే నాణ్యత, సౌకర్యాలు తనిఖీ చేయాల్సిన సంబంధిత శాఖలైన పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, రెవెన్యూ, విజిలెన్స్ తదితర విభాగాల అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో పెట్రోల్ బంకుల యాజమాన్యాలు యథేచ్ఛగా నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాయి.

పెట్రోల్ బంకుల్లో మోసాలు ఇలా...

మైక్రోచిప్ మాయాజాలంతో పెట్రోల్ బంకుల్లో మోసాలు జరుగుతున్నాయి. ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు, సిబ్బంది అక్రమాలకు తెరతీస్తున్నారు. పెట్రోల్ వేసేందుకు పైపు నాజిల్ తీసి బైక్ ట్యాంక్‌లో పెట్టగానే.. కొన్నిచోట్ల తొలుత సున్నాతో ప్రారంభమవుతోంది. ఆ తర్వాత క్షణాల వ్యవధిలోనే రూ.వందల విలువగల ఆయిల్ వెళ్లినట్లు రీడింగ్ చూపిస్తోంది. మరి కొన్ని చోట్ల మీటర్ రీడింగ్ 10 లేదా 20 పాయింట్ల వద్ద ప్రారంభమవుతోంది. అత్యధిక బంకులో రూ.100కి రూ.90 మాత్రమే పట్టే పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితులు అన్నిటికీ ముందుగానే మదర్ బోర్డులలో రీడింగ్ తప్పుగా మైక్రోచిప్‌లో తప్పుడు సంకేతాలు ఇచ్చేలా రూపొందించడం కారణమని తెలుస్తోంది. డిజిటల్ కాటా లోపలి భాగంలో ఇంటిగ్రేటెడ్ చిప్ అమర్చి రిమోట్ కంట్రోల్ ద్వారా రీడింగ్ ఎక్కువగా చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా కొలతల తేడా చూపించే అవకాశాలు ఉన్నాయి. ఈ విధమైన పద్ధతి పట్టణాలతోపాటు జాతీయ రహదారిపై ఉన్న అనేక బంకుల వద్ద కనిపిస్తోంది.



అనుసరించాల్సిన నిబంధనలు

పెట్రోలు బంకుల్లో 10 వేల లీటర్ల ఇంధనం విక్రయిస్తే వచ్చిన ఆదాయంలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.600 వెచ్చించాలి. నెలకు రూ.18 వేలు మరుగుదొడ్లకు, మంచినీరు, ఇతర సౌకర్యాల కల్పనకు ఖర్చు చేయాలి. వినియోగదారుల టైర్లలో గాలి తగ్గి బంకు వద్దకు వస్తే గాలి నింపే యంత్రాలు పని చేయడం లేదని అక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. నిబంధనల ప్రకారం తప్పనిసరిగా వాహనాలకు గాలి నింపే యంత్రాలు ఏర్పాటు చేయాలి. నిత్యం పని చేయాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహన చోదకులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు ఉండాలి. కానీ ఎక్కడా ఏర్పాటు చేయడం లేదు. ఒకవేళ ఉన్నా తాళాలు వేసి కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల అవి తెరచి ఉన్నా అపరిశుభ్రంగా ఉంటున్నాయి. ప్రతి బంకులో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్ ఉండాలి. వాహనదారులు అందులో నమోదు చేసుకునే అవకాశం కల్పించాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి. తాగేందుకు నీరు అందించాలి. పెట్రోలు నాణ్యతా ప్రమాణాలు పరీక్షించడానికి ఫిల్టర్ పేపర్లు వినియోగదారులకు ఇవ్వాలి.. ప్రతి బంకులో సంస్థ వివరాలతో పాటు యాజమాని పేరు అందరికీ కన్పించేలా ప్రదర్శన బోర్డు ఏర్పాటు చేసి మొబైల్ నెంబర్లు బోర్డుపై రాయాలి. అత్యధిక బంకులలో ఈ నిబంధనలు కన్పించడం లేదు. కొనుగోలుదారులు బంకుల్లో సౌకర్యాలు లేకపోతే సెంట్రలైజ్డు గ్రీవెన్స్ అండ్ మోనిటరింగ్ సిస్టమ్ పోర్టల్ అయిన పిజిపోర్టల్.జిఓఇ.ఇన్‌కు లేదా జిల్లా పౌరసరఫరా అధికారి, తూనికలు, కొలతల శాఖాధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న నడిపల్లికి చెందిన మహిళలు

తాగునీటి ఎద్దడిపై మహిళల ఆందోళన

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని నడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గత కొంతకాలంగా ప్రజలకు తాగునీరు అందక పలు ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆదివారం ఆందోళన చేపట్టారు. ప్రధానంగా మూడు నెలల నుండి జల్ జీవన్ పనుల సాకు చూపుతూ గ్రామపంచాయతీ ప్రజలకు తాగునీరు అందించకుండా కాలయాపన చేస్తున్నారని పలువురు అంటున్నారు. వేసవిలో ప్రజలు గొంతెండి బిందెడు నీళ్లు దొరక్క ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తూ ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఉగాది శ్రీరామనవమి పండుగ సీజన్లో కూడా తాగునీరు సక్రమంగా అందజేసిన దాఖలాలు లేవని వాపోతున్నారు. గ్రామంలో అందరికీ చేతు పంపులు లేక ఎక్కువ మంది తాగునీరు ఇతర అవసరాలకు పంచాయతీ నీటిపై ఆధారపడుతున్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడు లేడని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్‌లో సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు అధికారులు అందజేసే క్రమంలో పంచాయతీ కుళాయి నీటి పన్ను మినహాయించుకుని మిగిలిన సొమ్ము లబ్ధిదారులకు అందజేశారని పలువురు అంటున్నారు. కుళాయి పన్ను వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజలకు తాగునీరు అందించడంలో శ్రద్ధ లేదని వారు వాపోయారు వంట చేసుకోవడానికి, తాగటానికి వాటర్ ప్లాంట్ల వద్ద నుండి గత కొంతకాలంగా నీటిని కొనుగోలు చేయవలసిన దుర్భర పరిస్థితి ఏర్పడిందని పలువురు అంటున్నారు. అధికారులు స్పందించి వేసవిలో ప్రజల దాహార్తి తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హోరుగాలి.. భారీ వాన..

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

హోరు గాలి.. భారీ వానతో మండలంలో ఆదివారం రాత్రి వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయింది. సాయంత్రం 6 గంటల వరకూ మండిన ఎండ, అనంతరం వీచిన చల్లగాలితో ప్రజలు సేద తీరుతుండగా, రాత్రి 9 గంటల అనంతరం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు మెరుపులతో పాటు, భారీ గాలులతో కూడిన వర్షం కురిసింది. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం నుంచి ప్రజలు తేరుకోకముందే అదే స్థాయిలో భారీ వర్షం కురిసింది. వరి చేను కోత కొచ్చిన సమయంలో ఈ విధంగా వానలు పడటం రైతన్నలను ఆందోళనకు గురి చేస్తోంది. సుమారు 50 నిమిషాల పాటు ఏక ధాటిగా వర్షం కురిసింది.

ఉదయ రిషితకు పలువురి అభినందన

ప్రజాశక్తి-కడియం

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో కడియంకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ వంగపండు వీరభద్రరావు కుమార్తె ఉదయ రిషిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. రాజమహేంద్రవరం తిరుమల జూనియర్ కాలేజ్‌లో బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్న రిషిత 440 మార్కులకు గాను 435 మార్కులు సాధించింది. దీంతో రిషితను పలువురు అభినందించారు. మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఫోన్‌లో రిషితను అభినందించారు. ఆమెను అభినందించిన వారిలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, చెల్లుబోయిన శ్రీనివాస్, వైసిపి రాష్ట్ర నాయకులు గిరజాల బాబు, రామచంద్రరావు ఉన్నారు.

టిఐఎస్‌లో సమాచారం ధ్రువీకరించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలను అనుసరించి స్కూల్ అసిస్టెంట్స్ సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిఐఎస్) ఆధారంగా రూపొందించామని, సమాచారాన్ని సరి చూసుకోవాలని డిఎస్ఇఒ కె.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ జాబితాలు ఆర్‌డి కాకినాడ వెబ్‌సైట్ www.rjdsekkd.orgలో సంబందిత ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లా విద్యాశాఖల వెబ్‌సైట్, నోటీసు బోర్డులలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. సీనియారిటీ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 16వ తేదీ లోపు వాటికి సంబంధించి ఉమ్మడి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సమర్పించి, సరి చేయించుకోవాలని తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు పరీక్ష

ప్రజాశక్తి గోపాలపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌కు ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.రాజేశ్వరి తెలిపారు. గోపాలపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఉదయం ఐదో తరగతికి, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి ప్రవేశపరీక్ష ఆదివారం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలకు ఐదో తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 225 మంది విద్యార్థులకు గాను 206 మంది హాజరైనట్లు తెలిపారు. 91 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ కు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 322 మంది విద్యార్థులకు గాను 277 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని కానూరు అగ్రహారంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ, జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ సోమవారం హాజరుకానున్నారు. మంత్రి దుర్గేష్‌తో పాటు మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు పాల్గొంటారని మండల తెలుగు యువత అధ్యక్షులు హనుమంతు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి, జనసేన కూటమి నాయకులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కార్టూ'నిజం'



నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

ఘనంగా గుడ్డిగూడెం పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-గోపాలపురం

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఇఒలు జి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గుడ్డిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలో పాఠశాల 100 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా హెచ్ఎం కురుకూరి వీరభద్రుడు అధ్యక్షతన వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి జి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుడికి మొక్కినట్టే బడికి మొక్కలని, పిల్లలకు చదువును వారసత్వంగా ఇవ్వాలని, నేడు ప్రభుత్వ పాఠశాలలో సాంకేతిక విద్యతో పాటు ఆధునిక విద్యను ప్రతి పిల్లవాడికి అందిస్తున్నామని తెలిపారు.

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండేలా విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందిస్తున్నామన్నారు. ప్రతి పిల్లవాడికి మూడు జతల ఉచిత యూనిఫామ్స్, ఉచిత పాఠ్య పుస్తకాలు, షూస్, బెల్ట్, సమతుల్య పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్లో ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు ఉంటారన్నారు. మీ పిల్లలకు ఎలాంటి చదువు కావాలో ఎస్ఎంసి కమిటీలు చర్చించుకుని మీ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. హెచ్ఎంలు కురుకూరి వీరభద్రుడు మాట్లాడుతూ గుడ్డిగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుండి 5వ తరగతి వరకు 105 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. ఆరుగురు విద్యా బోధనలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. ఈ పాఠశాలను ప్రస్తుతం మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మడిచర్ల ప్రసాద్, ఎంపిటిసి బొర్రా ఆంజనేయులు, మాజీ సర్పంచ్ ఆకుల రాము, ఎస్ఎంసి చైర్మన్ మెంటి సరోజిని, పాఠశాల దాతలు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిఆర్‌పి కొయ్య నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షితులని చేసినది.

మండలానికి వచ్చిన అదనపు పోలీసులు

అంబేద్కర్ జయంతికి బందోబస్తు

ప్రజాశక్తి-తాళ్లపూడి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను సోమవారం మండలంలోని ప్రజలు ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. ఈ వేడుకలు నిర్వహించుకోవడానికి డిజె అనుమతులు లేవని అంటూ ప్రతి ఒక్కరూ పండగలా ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిశీలించేందుకై మండలానికి అదనపు పోలీసులు ఒక సిఐ, ఒక ఎస్ఐ, ఎఎస్ఐ ఐదుగురు కానిస్టేబుల్స్‌ను నియమించారని, వీరు మండలంలో పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు.

వృద్ధురాలికి మానవత ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అగ్ని ప్రమాదంలో గుడిసె మొత్తం కాలిపోయి, ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలికి మానవత ఉండ్రాజవరం శాఖ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థ రాజు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని చివటం గ్రామానికి చెందిన నీలం తులసమ్మ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయింది. నిలువ నీడ లేకపోవడంతో ఆమె తన కుమార్తె ఇంటిలో తలదాచుకుంటోంది. విషయం తెలుసుకున్న సిద్ధార్థ రాజు రూ.5000 నగదు, బస్తా బియ్యం ఆమెకు అందజేశారు. దీంతోపాటు వడ్లూరుకు చెందిన దొంగ వెంకటేశ్వరరావు రూ.వెయ్యి అందజేశారు. ఈ సందర్భంగా చివటం ఎంపిటిసి వేముల వెంకట సత్యనారాయణ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్లూరు వైసిపి నాయకులు రఘుమండ శ్రీనివాస్, ముమ్మిడి రాధాకృష్ణ పాల్గొన్నారు.

తులసమ్మకు నగదు అందజేస్తున్న సిద్ధార్థ రాజు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం, సంఘాయిగూడెం ఆర్‌సిఎం చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కృష్ణంపాలెంలోని వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. అనంతరం ఈతమట్టలు చేతబట్టి నినాదాలు చేశారు. గుడ్ ఫ్రై డే ముందు ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకుంటామని ఫాదర్ డేనియల్, పాస్టర్ సురేష్ తెలిపారు.

క్రెడాయ్ చాప్టర్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక హోటల్ మంజీర కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. క్రెడాయ్ రాజమహేంద్రవరం చాప్టర్ సెక్రటరీ చల్లా బాలమురళీ కృష్ణ స్వాగతం పలికిన ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రాజకీయ, వ్యాపార ప్రముఖులు, క్రెడాయ్ రాష్ట్ర నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. 2025-27కు క్రెడాయ్ రాజమహేంద్రవరం చాప్టర్ గౌరవ చైర్మన్ మన్నె సుబ్బారావు, చైర్మన్ సూరవరపు శ్రీనివాస్ కుమార్, అధ్యక్షుడు మన్యం సంతోష్ ఫణి కుమార్, ఉపాధ్యక్షులు వెలుమూరి భీమ శంకరరావు, రెడ్డి రామకష్ణ, పూడి వెంకట శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చల్లా బాలమురళీ కృష్ణ, కోశాధికారి టివిఎల్ నరసింహారావు, ఎన్విరాన్‌మెంట్ వింగ్ క్రెడాయ్ నేషనల్ శేఖర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు కోన మోహనరావు, వై.గురుదేవ్, కట్రు మల్లికార్జున రావు, ఎజ్జు శ్రీనివాస్ కిరణ్, అరిగెల పథ్వీ చరణ్, తదితరులతో కూడిన నూతన కార్యవర్గం చేత చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. సీనియర్ సభ్యులు, క్రెడాయ్ భవనానికి స్థలం బహుకరించిన సూరవరపు రామారావు, దారా సూర్యనారాయణ, చక్రధరరావుతో పాటు మెరపల శ్యామలరావు, నందెపు శ్రీనివాస్‌ను సత్కరించారు. సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్ కుమార్, మార్గాని భరత్ రామ్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంఎల్ఎ రౌతు సూర్యప్రకాశరావు, టిడిపి రాష్ట ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, బిసి రాష్ట్ర నాయకులు మార్గాని నాగేశ్వరరావు, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, సిసిసి ఎండి పంతం కొండలరావు, జనసేన సిటీ ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ, బిజెపి నాయకుడు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్, రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిల రెడ్డి, ఛాంబర్ పూర్వ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, బూర్లగడ్డ వెంకట సుబ్బారాయుడు, ప్రసాదుల హరినాథ్ తదితరులు హాజరయ్యారు. ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రెడాయ్ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదే సమయంలో ప్రభుత్వమే అన్నీ చేయలేదు కనుక సమాజ హిత కార్యక్రమాల్లో క్రెడాయ్ తనవంతు పాత్రను మరింతగా పోషించాలని కోరారు. ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ క్రెడాయ్‌కి అండగా ఉంటామని, ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కారానికి కషి చేస్తామని అన్నారు. భూముల విలువ పెంచొద్దని కోరిందే తడవుగా కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుందని అన్నారు. క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయం తరవాత పెద్ద రంగంగా రాణిస్తున్న భవన నిర్మాణ రంగంలో క్రెడాయ్ నిబద్ధతతో పని చేస్తూ, రెరా రాకముందే నియమావళి రూపొందించుకుని పారదర్శకంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ కింద పలు సేవా కార్యక్రమాలు క్రెడాయ్ చేపడుతోందని వివరించారు. రాష్ట్ర పూర్వ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో క్రెడాయ్ సభ్యులు పనిచేస్తూ నమ్మకానికి వేదికగా నిలుస్తున్నారని అన్నారు.

ఈత సరదా...! ప్రాణాలకు ముప్పు...!

ప్రజాశక్తి-కడియం

వేసవి తాపం మొదలయ్యింది. ఒక వైపు బడులకు సెలవులు, మరోవైపు తీవ్ర ఉక్కపోత. దీంతో ఎండల నుండి సేద తీరడానికి పిల్లలు పరిసర ప్రాంతాలలో ఉండే కాలువలు, చెరువులు వైపు అడుగులు వేస్తున్నారు. పరీక్షలు రాసి ఖాళీగా ఉన్న చిన్నారులు ఈతకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు . వీరి సరదా ప్రాణాలకు ముప్పు తెచ్చి పెడుతోందనే విషయాన్ని గ్రహించకుండా, పిల్లలతో ఆడుకోవడానికి అంటూ ఇంటి నుంచి వెళ్లి కాలువలు, చెరువుల్లో ఈత కొడుతూ స్నానాలు చేస్తున్నారు.ఇలాంటి సమయంలో జాగ్రత్తలు పాటించకపోతే తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగిల్చినవారవుతారు. కడియం మండలంలో వేమగిరి నుండి జేగురుపాడు ఆడదానిరేవు వరకు, అలాగే వేమగిరి నుంచి మడికి వరకు పెద్ద కాలువల్లో వివిధ చోట్ల పదుల సంఖ్యలో స్నానాల రేవులు ఉన్నాయి. వీటితో పాటుగా మండల సమీపంలోని ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ, రాజమహేంద్రవరం పుష్కరఘాట్, పిచ్చుకలంకల్లోని ఇసుక దిబ్బలు తదితర ప్రాంతాలలో పిల్లలు స్నానాలకు వెళ్లడానికి మొగ్గు చూపుతున్నారు. ప్రమాదాలు సంభవించిన తరువాత బాధ పడే కంటే, ముందుగానే మేల్కొని తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. సంబంధిత అధికారులు ప్రతి గ్రామంలోనూ, కాలువ సమీప పరిసరాల్లో హెచ్చరికలు ఏర్పాటు చేయాలి. పోలీసు వారు దృష్టి పెట్టి, పిల్లలతో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లలను స్నానాలకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ, ఎల్లప్పుడూ పిల్లలను ఓకంట కనిపెడుతూ ఉంటే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు.

కాలువలో స్నానాలు చేస్తున్న బాలురు

చిలకపాడు రోడ్డులో నిర్వహిస్తున్న కల్వర్టు పనులు

కాల్దారి, ఉండ్రాజవరం రహదారి సిద్ధం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని కాల్దారి శ్మశానం వద్ద నుండి చిలకపాడు మీదుగా ఉండ్రాజవరం చేరుకునే రహదారి మే నెల చివరికల్లా పూర్తిస్థాయి ప్రయాణానికి సిద్ధమవుతోందని పంచాయతీరాజ్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.అగస్టీన్ తెలిపారు. 6.6 కిలోమీటర్ల నిడివి గల రోడ్డుకు గత సంవత్సరం నవంబర్ నెలలో చేపట్టిన బిటి రోడ్డుకు అవసరమైన కల్వర్టుల నిర్మాణం పూర్తయిందని, రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయన స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నట్లు అగస్టీన్ తెలిపారు. అంచనా వ్యయం రూ.417 లక్షల ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నిధులతో నిర్మాణం జరుగుతోందని తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఉపాధి కోసం వెళ్లి.. ప్రాణాలు కోల్పోయి..

ప్రజాశక్తి - సామర్లకోట

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాస పట్టణంలో బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన భారీ పేలుడు ఘటన సామర్లకోట, వేట్లపాలెం ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం తీవ్ర ఉత్కంఠ రేపింది. ప్రమాదంలో మృతులంతా సామర్లకోటకు చెందిన వారిని మీడియాలో ప్రచారం కావడంతో సామర్లకోట, వేట్లపాలెం నుంచి ఉపాధి కోసం వెళ్లిన కూలీల కుటుంబాలు తీవ్ర ఆందోళన గురయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన గోడత నిర్మల(38) ఉపాధికై బాణాసంచా తయారీ కేంద్రంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో మృతి చెందింది. మృతురాలికి భర్త, ఐదేళ్ల పాప ఉంది. అలాగే సామర్లకోట పెన్షన్ లైన్‌కు చెందిన వేలంగి రాజు, వేలంగి సంతోషి, వారి కూతురు షారోన్ ఈ ప్రమాదంలో గాయపడ్డారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడలోని సత్తెమ్మ తల్లి గుడి సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం గొల్లప్రోలు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 9 మందిని అదుపులో తీసుకుని వారి నుంచి రూ.10,850 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.రామకృష్ణ తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కరప

ఈ నెల 9వ తేదీన పురుగుల మందు తాగిన వ్యక్తి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. కరప పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వలసపాకల గ్రామానికి చెందిన చాట్రా అప్పారావు (38) భార్యతో వీరమణితో కలిసి ప్రకాశం జిల్లా అద్దంకికి ఉపాధి కోసం వెళ్లారు. ఇటుకల బట్టి పని చేస్తున్నారు. అయితే భార్యతో గొడవ పడి 10 రోజుల క్రితం వలసపాకల గ్రామానికి వచ్చేశాడు. అయితే భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురియైన అప్పారావు ఈ నెల 9వ తేదీన మద్యంలో పురుగుల మందు తాగేశాడు. ఈ విషయం గమనించిన అతని తల్లి సౌదామణి కాకినాడ జిజిహెచ్‌కు తరలించింది. నాటి నుంచి చికిత్స పొందుతున్న అతని ఆరోగ్యం విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - కొవ్వూరు

మండలంలోని దొమ్మేరు ప్రుంత రోడ్లో గత నెల 26వ తేదీన జరిగిన హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను డిఎస్‌పి జి.దేవకుమార్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత నె 26వ తేదీన దొమ్మేరు వెళ్ళు రోడ్డులో నీరుకొండ శేషగిరిరావు డ్రాగన్ ఫ్రూట్ తోటలో హత్యకు గురయిన పెండ్యాల ప్రభాకర్‌రావు మృతికి ఆర్థిక వ్యవహారాలే కారణమని అన్నారు. పోలవరం మండలం పాత పట్టిసీమ గ్రామానికి చెందిన చుక్క రామశ్రీనివాస్, పెద్దేవం గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తు, దొండపూడి గ్రామానికి చెందిన అంకోలు జగదీష్ దుర్గాప్రసాద్, పోలవరం గ్రామానికి చెందిన నోముల ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి ప్రభాకర్‌ను హత్య చేశారు. మృతుడు ప్రభాకర్ విస్టేజ్ కంపెనీ ఉత్పత్తుల వ్యాపారం చేస్తూ ఏజెంట్ల ద్వారా కంపెనీ ఉత్పత్తులు విక్రయిస్తూ ఉంటాడు. నిందుతుడు చుక్క రామ శ్రీనివాస్ 2024 డిసెంబర్ నెలలో మృతిని వద్ద నుంచి రూ.2.40 లక్షలు అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చమని ప్రభాకర్ అతనిని అడిగాడు. దీంతో ప్రభాకర్‌ను చంపేస్తే అప్పు తీర్చనవసరం లేదని, అతని ఒంటిపై ఉన్న బంగారాన్ని దోచుకోవడం ద్వారా తనకున్న క్రికెట్ బెట్టింగ్, ఇతర విలాసాలతో చేసిన అప్పులు తీరిపోతాయని ఈ హత్యకు పాల్పడ్డాడు. ప్రభాకర్‌ను పథకం ప్రకారం ఇంటి నుంచి బయటకు రప్పించి మాయ మాటలతో నమ్మించి దొమ్మేరు పుంత వద్దకు తీసుకువెళ్లి తన వెంట తెచ్చుకున్న కత్తితో హత్య చేయడమే కాకుండా మృతుని ఒంటిపై ఉన్న బంగారపు నగలను తీసుకునే క్రమంలో కుడి చేతికి ఉన్న బంగారు కడియం, నాలుగు బంగారు ఉంగరాలు తీయబోగా అవి రాకపోవడంతో మృతుని కుడి చేతిని కత్తితో గుత్తి వరకు నరికివేసి బంగారు వస్తువులను తీసుకుని అంకోలు జగదీష్ దుర్గాప్రసాద్ బండి మీద దొమ్మేరు, కాపవరం మీదుగా పోలవరం మండలం పాత పట్టిసీమ గ్రామంలోని అతని ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం నోముల ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మృతుడు చేతి గుత్తిని, కత్తిని, సెల్‌ఫోన్‌ను, బట్టలను బ్యాగ్‌లో పెట్టి గూటాల వద్ద గోదావరి నదిలో పడవేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి ముద్దాయి అయిన రామ్‌శ్రీనివాస్‌ను ఈ నెల 12వ తేదీన అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని నుంచి బంగారు వస్తువులు, మోటార్ సైకిల్, 2 సెల్‌ఫోన్లు, రెండు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇతర ముద్దాయిలైన అంకోలు జగదీష్ దుర్గాప్రసాద్, నోముల ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐలు పి.విశ్వం, విజయబాబు, క్రైమ్ ఎస్ఐ రవీంద్ర, కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

చిన్నారికి మంత్రి సుభాష్ రూ. 20 వేల సాయం

ప్రజాశక్తి- కె.గంగవరం

కె.గంగవరం మండలం పాతకోట గ్రామానికి చెందిన చిన్నారి తేజస్విని భీమవర్షిణికు తల్లిదండ్రులు లేరు. ఆ చిన్నారిని అమ్మమ్మ, తాతయ్యలే పెంచి పోషిస్తున్నారు. వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న మంత్రి సుభాష్ రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. పిల్లలను చదివించాలని ఈ సందర్భంగా మంత్రి అమ్మమ్మకు మంత్రి వివరించారు. మంత్రి వెంట పలువురు టిడిపి కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో పెరిగిన ఉత్తీర్ణత

ప్రజాశక్తి - సామర్లకోట

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పి హైస్కూల్ ప్లేస్‌లో ఇంటర్ విద్యార్థులు ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ ఒకేషనల్ విభాగంలో 130 మంది పరీక్షకు హాజరుకాగా 77 మంది ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ జనరల్ విభాగంలో 102 మంది విద్యార్థులు హాజరుకాగా 35 మంది ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్ నుంచి ఒకేషనల్ విభాగంలో 112 మందికి 95 మంది ఉత్తీర్ణత సాధించారు. జనరల్ విభాగం నుంచి 73 మందికి 42 మంది పాసయ్యారని తెలిపారు. మొదటి సంవత్సరం 48 శాతం, రెండో సంవత్సరం 74 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. జడ్పి బాలిక ఉన్నత పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ నుంచి 20 మంది విద్యార్థులు హాజరు కాగా 9 మంది పాసయ్యారు. ఇంటర్ రెండవ సంవత్సరం నుంచి 21 మంది విద్యార్థులు హాజరుకాగా 14 మంది ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం యు.మీనామాధురి చెప్పారు. జూనియర్ ఇంటర్లో బైపిసి నుంచి పి.ప్రమీలజ్యోతి 317 మార్కులు సాధించగా, సీనియర్ ఇంటర్లో నూతలపాటి మాన్విత 848 మార్కులు సాధించినట్లు చెప్పారు

ఇంటర్‌లో ఆచార్య జూనియర్ కళాశాల విజయకేతనం

ప్రజాశక్తి - కాకినాడ

ఆచార్య జూనియర్ కాలేజ్ అండ్ ఐఐటి మెడికల్ అకాడమీ ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేసింది. జూనియర్ బైపిసి విభాగంలో డి.జోష్న 430 /440, జి.ఎల్.సాయిలహరి 428, వి.సౌజన్య 427, సిహెచ్.వైష్ణవి 426, ఎంపిసిలో నిహారిక దేవి 463/470, ఎ.నవ్యశ్రీ 463, ఉషశ్రీ 458, జిఆర్.వెంకట్ 454, జి.కావ్యశ్రీ 450, సీనియర్ బైపిసిలో ఎస్.ధనలక్ష్మి 982, పి.గీతిక 979, ఐ.ఆదిత్య రాయుడు 978, కె.గీతిక 978, ఎంపిసిలో ఎ.సౌమ్య 980/1000, పి.బాలగణేష్ 978/1000, డి.లాస్యచరిష్మ 971/1000 మార్కులు సాధించారని కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ పోలిశెట్టి దుర్గాప్రసాద్ తెలిపారు. ఇంతటి ప్రతిభను చాటుకున్న విద్యార్థినీ, విద్యార్థులతోపాటు, అందుకు కృషి చేసిన తల్లిదండ్రులు, అధ్యాపకులను ఆయన అభినందించారు. రాబోయే విద్యా సంవత్సరంలో ఆచార్య కాలేజీలో ఒక ప్రత్యేక ప్రణాళికతో ఉత్తమమైన శిక్షణ ఇచ్చి మరిన్ని విజయాలను అందుకుంటామని తెలిపారు.

దేవి హాసినికి జిల్లా ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - కాజులూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కాదా దేవిహాసిని జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 93 మంది విద్యార్థులు హాజరుకాగా 66 మంది విద్యార్థులు పాసై 71 శాతం ఉత్తీర్ణత పొందారని తెలిపారు. మొదటి సంవత్సరం 84 మంది విద్యార్థులు హాజరుకాగా 42 మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన దేవి హాసిని ఎంపిసిలో 976 మార్కులు సాధించిందని తెలిపారు. అందుకు సహకరించిన తల్లిదండ్రులు, అధ్యాపకులను ప్రిన్సిపల్‌తోపాటు, ఎంపిడిఒ రాంబాబు, తహశీల్దార్ ఠాగూర్, జనసేన మండల ఇన్‌ఛార్జ్ అన్నం శ్రీరామచంద్రమూర్తి అభినందించారు.

విజయఢంకా మోగించిన సహస్ర విద్యార్థులు

ప్రజాశక్తి - కాకినాడ

ఇంటర్మీడియట్ ఫలితాల్లో సహస్ర కాలేజ్ విద్యార్థులు విజయ ఢంకా మోగించారు. జూనియర్ బైపిసిలో జి. మంజునాథ చక్రం 434/440, సీనియర్ బైపిసి, ఎంపిసిలో ఎం.చక్రికా మణిసాయి 989/1000, ఒ.మాధురి 983, ఆర్.శ్రావ్యహాసిని 983, వి.మమత 976, కమలేష్‌కుమార్ 976, ఎస్-ఎల్‌పి.అశస్వి 973, బిఎస్ఎన్.శ్రీనివాస్ 987, ఒఎంవి.వర్మ 984 మార్కులు సాధించారని కాలేజ్ డైరెక్టర్ మానేపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. అందుకు సహకరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులను ఆయన అభినందించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఎల్ఎన్ కార్పొరేట్ స్థాయి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్‌తో ఒప్పందం చేసుకున్నామని, తద్వారా మరిన్ని విజయాలను అందిస్తామని అన్నారు.

ఆర్‌టిసి బస్సు సౌకర్యాన్ని కల్పించాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి నుంచి తుని ప్రయాణించాలంటే ఆటోలే దిక్కువుతున్నాయి. ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు ఉంటే తప్ప ఆటో ముందుకు కదలని పరిస్థితి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం వేళలో ఒకసారి మాత్రమే తుని నుంచి రౌతులపూడికి ఆర్‌టిసి సేవలు అందుతున్నాయి. అయితే ఈ నెలలో విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం, సాయంత్రం కూడా బస్సు సౌకర్యం ఉండదనే ఆందోళన స్థానికులను వెంటాడుతోంది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు రోజు వారీ పనుల నిమిత్తం తునికి రాకపోకలు సాగించడం జరుగుతోంది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వేసవి సెలవుల్లోనూ ఆర్‌టిసి సేవలను అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

కాలనీల్లో గుంపులుగా పందులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో పేదలు నివసించే కాలనీల్లో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు కుక్కలు, పందుల బెడదతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. పందులు గుంపులు, గుంపులుగా కాలనీలలో సంచరిస్తూ రహదారిపై వెళ్లే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పందులు బెడదను నివారించాలని విజ్ఞప్తి చేశారు.

ఆహార నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మధుమేహ వ్యాధిగ్రస్తులు ఏ ఆహార పదార్థాలు అయినా తీసుకోవచ్చు కానీ మితంగా తీసుకోవాలని డాక్టర్ రాఘవేంద్రరావు అన్నారు. ఆదివారం బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక జీవనశైలి కారణంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజు రోజుకి పెరుగుతుందని అన్నారు. ఈ వ్యాధి వస్తే జీవితాంతం మందులు వాడాల్సిందేనని, అదేవిధంగా ఆహార నియమాలు పాటించాలని అన్నారు. వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, రాఘవరావు, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

మాచర మట్టలు, శ్రీరాంపురం వెళ్లే రహదారి దుస్థితి ఇలా..

రహదారి ఇలా.. ప్రయాణించేదెలా..

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలో మాచర పంచాయతీ శివారు మాచరమట్టలు, శ్రీరాంపురం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. కపిలేశ్వరపురం నుంచి దివాణం మీదుగా మాచర మట్టలు, శ్రీరాంపురానికి వెళ్లే మార్గంలో ప్రతినిత్యం విద్యార్థులు, వాహనదారులు, ప్రయాణికులు, రాకపోకలు సాగిస్తారు. ఈ రహదారి మార్గంలో పలుచోట్ల భారీ గోతులు ఏర్పడడంతో పాటు రాళ్ళు కూడా పైకి రావడంతో రైతులు, వాహన దారులు అవస్థ పడుతు న్నారు. వర్షాలు పడిన సందర్భాల్లో ఈ రహదారి మరింత అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా తయారయి ంది. రాత్రి సమయాల్లో ప్రయాణం సాగించే వాహన దారులు రైతులు కాలువలో పడే ప్రమాదం ఉంది. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి రహదారిని మెరుగుప రచాలని విద్యార్థులు, వాహనదారులు, రైతులు, కోరుతున్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -మామిడికుదురు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇటీవల జరిగిన ఇంటర్ ఫలితాలలో సత్తాచాటారని ప్రిన్సిపల్ ఎ.పద్మశ్రీ ఆదివారం తెలిపారు. జూనియర్ ఇంటర్లో వనమాడి వేణు శ్రీ సాయి వర్మ ఎంపిసిలో 457/470 మార్కులు సాధించి జిల్లాలో ప్రభుత్వ కళాశాల టాపర్‌గా నిలిచాడన్నారు. సీనియర్ ఇంటర్ విభాగంలో ముస్తక్ జెహ ఎంపిసిలో 941/1000, బైపిసిలో ఏడిద విజయ నాగ దుర్గ 920/1000, సిఇసిలో బొంతు కుమారస్వామి 873/1000, హెచ్ఇసి లో ములికి సతీష్ 704/1000 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ తెలిపారు. సీనియర్ ఇంటర్లో 73.58 శాతం, జూనియర్ ఇంటర్లో 56.25 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆమె అభినందించారు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కషిచేసిన అధ్యాపకులను ప్రశంసించారు. అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ కళాశాలలో టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు జాయిన్ అవ్వాలని, అడ్మిషన్ల ప్రారంభించామని ఆమె తెలిపారు

రోగులకు రొట్టెలు, పండ్లు అందజేత

ప్రజాశక్తి - తాళ్లరేవు

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న శివన్నారాయణ

పూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో స్థానిక సిహెచ్‌సిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ పూలే తన గురువు అని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ స్వయంగా ప్రకటించారని అన్నారు. అణగారిన వర్గాలకు విద్యా, సమాన అవకాశాలు కల్పించడం కోసం ఆయన నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. దేశంలో సమానత్వం సాధించడమే అంబేద్కర్ ధ్యేయమని, అందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారిణి స్నేహలత, నాయకులు అత్తిలి బాబురావు, టేకుమూడి ఈశ్వరరావు, బొంతు శ్రీనివాస్, బండారు దొరబాబు, సుందరపల్లి సత్యనారాయణ, వాకపల్లి చిరంజీవి, కుడుపూడి మల్లేశ్వరరావు, దున్నా ఎల్లారావు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

ప్రజాశక్తి - గండేపల్లి, యు.కొత్తపల్లి

గండేపల్లిలో గాలికి కూలిపోయిన హోర్డింగ్

మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా భారీ ఈదురు గాలులతో కురిసిన వర్షంతో చెట్లు నేలకొరిగాయి. రేకుల షెడ్లు ఎగిరిపోయాయి. విద్యుత్‌కు అంతరాయం కలిగింది. ఈదురు గాలులతో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈదురు గాలులతో మండలంలో చెట్లు, విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అమీనాబాద్ గ్రామంలో విద్యుత్ వైర్లు దిగబడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామాల్లో చీకటి అలుముకుంది. గాలితోపాటు వర్షం తోడవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

జర్నలిస్టుల సంక్షేమానికి వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. ఎస్.యానాం ఆంధ్ర గోవా బీచ్‌లో ఏపి జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మెమోరియల్ బీచ్ వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎంఎల్ఎ ఆనందరావు మాట్లాడుతూ పని చేసే జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్స్, హెల్త్ కార్డ్స్ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. విజేతలుగా నిలిచిన అనంతపురం, తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాల జట్లకు ఎంఎల్ఎ ఆనందరావు షీల్డులు అందజేశారు. వృత్తిపరంగా నిత్యం వత్తిడిలో జీవించే జర్నలిస్టుల కోసం ఇలా ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఎస్.యానాం బీచ్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ లో ఇక్కడ జాతీయ, అంతర్జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలతో పాటు క్రికెట్ టోర్నమెంట్లు కూడా నిర్వహించేలా స్టేడియం నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ భవిష్యత్ లో నిర్వహించే కార్యక్రమాలకు కూడా తన వంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఎంఎల్ఎ ఆనందరావు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు ఓబులం ప్రసాద్, ప్రచార కార్యదర్శి తలారి నాగలింగ స్వామి, డిసి ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు, జనసేన నాయకులు పలచోళ్ళపద్మనాభం, తెలుగురాష్ట్రం దినపత్రిక ఎడిటర్ అయితాబత్తుల రాజశేఖర్, కోనసీమ వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి మూర్తి,టిడిపి మీడియా కో-ఆర్డినేటర్ బోళ్ల సతీష్ బాబు, పిఇటి లు ఫణి,శివకుమార్, సీతారామారావు, తదితరులు పాల్గొన్నారు.

విజేత జర్నలిస్టు వాలీబాల్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

ర్యాంక్ లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

ఆదిత్య విద్యార్థులకు ఎంఎల్ఎ వేగుళ్ల అభినందన

ప్రజాశక్తి - మండపేట

సీనియర్, జూనియర్ ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మండపేట ఆదిత్య కళాశాల విద్యార్థులను ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అభినందించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మండపేట ఆదిత్య కళాశాల డైరెక్టర్ చిర్ల జె.సుబ్బిరెడ్డి సిబ్బందితో కలసి ఎంఎల్ఎ వేగుళ్లను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఎంఎల్ఎ చేతులమీదుగా పుష్పగుచ్ఛం అందజేశారు. వారిని దుశ్శాలువాలతో సత్కరించి ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో సీనియర్ ఇంటర్ ఎంపిసి గ్రూపులో 1000 మార్కులకు 992 మార్కులతో నల్లమిల్లి సవిత స్టేట్ ఫస్ట్, 990 మార్కులతో ఖండవల్లి వీరసాయి అమృత స్టేట్ థర్డ్ సుబ్బిరెడ్డి తెలిపారు. బైపిసి గ్రూపులో 1000 మార్కులకు 984 మార్కులతో పిచ్చుక మనోహర్ టౌన్ ఫస్ట్, 983 మార్కులతో మల్లిడి మణికంఠ రెడ్డి టౌన్ సెకండ్, జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి గ్రూపులో 470 మార్కులకు 466 మార్కులతో తాడి మాధవి స్టేట్ సెకండ్, 465 మార్కులతో తేతలి శ్యాం సందీప్ రెడ్డి స్టేట్ థర్డ్ సాధించినట్లు కాలేజీ డైరెక్టర్ సుబ్బిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, కాలేజీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ చట్టంతో భూ వివాదాల పరిష్కారం

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజలు ఎదుర్కొంటున్న భూ వివాదాలు, సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ చట్టాలు, నిబంధనల్లో సమూల మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భూముల క్రమ బద్ధీకరణ చట్టం-2025 ప్రవేశపెట్టిందని ఆదివారం ఒక ప్రకటనలో జెసి టి.నిషాంతి తెలిపారు. నిరుపేదలకు భూముల క్రమబద్ధీకరణ చట్టం-2025 ఒక వరంగా మారిందన్నారు. తెలిపారు. పేదలు ఎదుర్కొంటున్న భూ వివాదాలు, సమస్యల కోసం రెవెన్యూ చట్టాలు, నిబంధ నల్లో మార్పులు తీసుకురావా లని ప్రభుత్వం భావించి సామాన్యులు ఎదుర్కొంటున్న అసైన్డ్ భూముల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని నిర్ణయించిందన్నారు. అమల్లో ఉన్న రెవెన్యూ చట్టాలు, వాటి నియమ నిబంధనల్లో తీసుకురావాల్సిన మార్పులు, సవరణలు రెవెన్యూ వ్యవ స్థను మరింత సులభతరం చేయడం, ప్రజలకు చేరువ చేసే దిశగా కొన్ని మార్పులు తీసుకు వచ్చిందన్నారు. వ్యవ సాయ భూమి వినియోగ మార్పిడి కన్వర్షన్స్ తదితర పథకాలను మరింత బలో పేతం చేస్తూ అసైన్డ్ భూముల చట్టం ప్రకారం భూ ములను ఫ్రీ హోల్డ్ చేయడంలో పేద వర్గాల ప్రయోజనాలు కాపాడే కొత్త పాలసీని ఖరారు చేసిందన్నారు. జిఒ నెంబర్ 30 ద్వారా రెవెన్యూ శాఖకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. ఈ జిఒ ప్రధానంగా ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించినదన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించడం ఆక్రమిత భూముల్లో నివాసం ఏర్పరచుకున్న వారికి ఊరట కల్పిస్తుందన్నారు. 2019 అక్టోబర్ 15న కటాఫ్ డేట్గా ప్రభుత్వం నిర్ణయించిం దని ఈ తేదీ కంటే ముం దు ఆక్రమిత స్థలాల్లో నివాసం ఉంటేనే క్రమబ ద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. క్రమబద్ధీకరణకు అర్హులు కాని భూములు అనగా మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్ లో నిర్దేశిత స్థలాలు. లేఅవు ట్లు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, ఇతర జలవనరులకు సంబంధి చిన స్థలాలకు ఈ ఉత్త ర్వులు వర్తించవన్నారు. 150 గజాల వరకు ఉచి తంగా క్రమబద్ధీకరణ చేయనున్నారన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేర్ల పైనే జారీ చేస్తామని ప్రభుత్వం తెలిపిందన్నారు. భూముల క్రమబద్ధీకరణ చట్టం-2025 పేరుతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆక్ర మించుకున్న భూముల క్రమబద్ధీకరణకు మార్గ దర్శకాలు జారీ చేసిందన్నారు. ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి గతంలో జారీ చేసిన ఉత్తర్వులన్నిటినీ పక్కన పెడుతూ జిఒ నెంబర్ 30ను జారీ చేసిందన్నారు. ఈ జిఒ ద్వారా ప్రభుత్వం పేదల కు ఒక ముఖ్యమైన అవకాశం కల్పించిం దన్నారు. క్రమబద్ధీకరణకు ఈ ఏడాది డిసెంబర్ 31లోపుగా. గ్రామ, వార్డు సచివాల యంలో దరఖాస్తు దాఖలు చేయాలన్నారు. గడువు తేదీ లోపుగా దరఖాస్తు దాఖలు చేయని వారి ఆక్రమణలు తొల గించుటకు నిబంధనల ప్రకారం తహశీల్దార్ తగు చర్యలు తీసుకుంటారని గ్రహించాలన్నారు.

ద్రాక్షారామంలో పెరిగిపోతున్న ఆక్రమణలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామలో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. పంట కాలువలు, డ్రెయినేజీలు ఆక్రమణలకు గురవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే ద్రాక్షారామ లోని విజయ టాకీస్ నుంచి పంట పొలాలకు సాగు నీరు వెళ్లే పంట కాలువను పూర్తిగా ఆక్రమించారు. ముఖ్యంగా బొందుల గూడెం రోడ్ నుంచి యానాం సెంటర్ మార్కెట్ సెంటర్ వరకు ఆక్రమణదారులు ఆక్రమించి అనేక దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ పంట కాలువ ఆక్రమణలకు గురి కావడంతో ఈ కాలువపై పంటలు పండించే రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అదేవిధంగా మార్కెట్ నుంచి బయటకు వెళ్లే మురికి నీరు డ్రైనేజీ మొత్తం ఆక్రమణలకు గురి కావడంతో అసలు డ్రెయినేజీ ఎక్కడ ఉందో అర్థం కాని పరిస్థితి. వీటితోపాటుగా ద్రాక్షారామ బళ్ల మార్కెట్ సెంటర్ చుట్టూ గల పంచాయతీ స్థలాలు ఆక్రమణకు గురికావడంతో ఇక్కడ గల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం కనిపించకుండా పోయింది. దీంతో ఆరోగ్య కేంద్రానికి వెళ్లే సిబ్బంది ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితి ఉంది. ఆరోగ్య కేంద్రం చుట్టూ ఆక్రమణలకు గురి కావడంతో రోగులకు అసలు ఆరోగ్య కేంద్రం ఉందా లేదా అని అనుమానం కలుగుతోంది. దీనిపై అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ఆక్రమణదారులు ఇష్టారాజ్యం కొనసాగుతోంది. ఇక పంట కాలువ డ్రెయినేజీలను ఆక్రమించిన ఆక్రమణదారులు వ్యాపారాలు చేసుకుంటూ వాటి నుంచి వెలువడే వ్యర్థాలను పంట కాలువలను డ్రెయినేజీలలోను పడవేయడంతో ఇటు రైతులకు, అటు గ్రామస్తులకు తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నాయి. గ్రామపంచాయతీ అధికారులు, డ్రెయినేజీ అధికారులు, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ఆక్రమణలు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతు న్నారు. ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

మార్కెట్ సెంటర్‌లో డ్రెయినేజీపై ఆక్రమణలు

ఆరోగ్య కేంద్రం చుట్టూ ఆక్రమణలు

నోటీసు

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.A. No. 431/2024
E.P. No. 24/2020
O.S. No. 147/2014

Between:
సత్తి వెంకటరెడ్డి ...DHr
AND
అయినాల దేవి లలిత (died) వగైరాలు ...JDr/ Proposed LR's

To:
గోపిశెట్టి శ్రీవాణి, W/o. వెంకటేష్, 26 సం॥లు, హౌస్ వైఫ్, డోర్ నెం. 28-4-16, ముచ్చుమిల్లి, రామచంద్రపురం, రామచంద్రపురం మండలం, రామచంద్రపురం DMC.
-3వ రెస్పాండెంట్/ Proposed LR

పై నెంబరు పిటిషన్ దావా గ్రంథమునకు సంబంధించి 3వ రెస్పాండెంట్ యొక్క అప్పియరెన్స్ నిమిత్తం దివి. **22-4-2025 వాయిదాగా అయి వున్నది. కాబట్టి మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది: 22-4-2025
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

టి.వి.నారాయణరెడ్డి
పిటిషనర్/ DHr తరపు అడ్వకేట్
అనపర్తి, సెల్: 9849484239

జనరల్ నోటీసు

మా క్లయింటు కాకినాడ కాపురస్తులు కొవ్వూరు(లేటు)శ్రీనివాస రవి కృష్ణారెడ్డి గారి భార్య కొవ్వూరి నాగ సంధ్యారాణి గారి సంజాయిషి పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా

మా క్లయింటు భర్త గారైన శ్రీ కొవ్వూరి శ్రీనివాస రవి కృష్ణా రెడ్డి గారు **ది.29-01-2025** సం॥ తేదీన కాలం చేసినారు. మా క్లయింటు భర్త గారు ఆయన జీవిత కాలంలో మా క్లయింటు కుటుంబ యావత్తు వ్యవహారములు అనగా మా క్లయింటుకు సంభందించిన బ్యాంకు వ్యవహారములతో సహా ఆయనే స్వయంగా చూచుకొనెడివారు. ఆ క్రమంలో మా క్లయింటుకు 2015 సం॥లో కాకినాడ,**SBI** ఇంద్రపాలెం బ్రాంచ్ నందు **20286910763** గల అకౌంట్ నెం.నుండి 10 చెక్కులు గల ఒక బుక్కును తీసుకుని ఆయన తన యొక్క కుటుంబ వ్యవహారములుకు వాడుచుండేవారు. కాగా ఈ మధ్య కాలంలో నాక్లయింటు భర్త చనిపోయిన దర్మిలా గత నెలరోజులనుండి మా క్లయింటు భర్తకు సహోద్యోగులు మరియు స్నేహితులైన చక్రధర్ మరియు దుర్గా ప్రసాద్ గార్లు, మా క్లయింటు భర్తకు తెలిసిన వారి వద్ద మరియు మా క్లయింటుకు సంబందించిన వ్యక్తుల వద్ద తమకు మా క్లయింటు భర్త గారైన శ్రీ కొవ్వూరి శ్రీనివాస రవి కృష్ణా రెడ్డి గారు బాకీ పడినారని సదరు బాకీ నిమిత్తం మా క్లయింటు తాలూకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇంద్రపాలెం బ్రాంచ్ చెక్కు కలదని చెప్పుచున్నారని మా క్లయింటుకు తెలియవచ్చినది. మా క్లయింటు సదరు అకౌంట్ ను కాకినాడ, స్పెషల్ పర్సనల్ బ్యాంకింగ్ బ్రాంచ్, మెయిన్ రోడ్,కు గతసంవత్సరం క్రితం ట్రాన్స్ఫర్ చేసుకొనుట జరిగినది. కావున సదరు చెక్కులను ఎట్టి పరిస్థతులలోనూ ఆమోదించరాదని మా క్లయింటు బ్యాంక్ వారికి లెటర్ ఇచ్చుట జరిగినది. కావున మావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు పై నుదహరించిన **చెక్కు నెం.315192, 315194, 315196, 315197, 315198 మరియు 315200** పురస్కరించుకొని ఎవ్వరైనను ఎటువంటి లావాదేవీలు జరిపినప్పటికి సదరు లావాదేవీలు ఏమియును చెల్లనేరవు. అంతేకాకుండా ఎవ్వరైనను అట్లు జరిపిన లావాదేవీల పై మా క్లయింటు తీసుకొను సివిల్ క్రిమినల్ చర్యలకు భాధ్యులగుదురని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

యెరుబండి శ్రీ రంగనాయకులు
న్యాయవాది,డోరునెం.70-3-17/1,
ఆర్.టి.సి.కాలనీ, రమణయ్యపేట,
కాకినాడ-533005,సెల్.9885060061